# వివాహం

"అమ్మాయ్ ఆడపిల్లకు వివాహం చేయాలంటే గౌరవం మర్యాద గల కుటుంబంలోని పిల్లవానిని వెతకాలి. పిల్లవాడు అందంగా వుండాలి అని అనుకోకూడదు. వస్తుతః సాంప్రదాయం చూడాలి. పదిడబ్బులు తెచ్చుకొనేవాడుగా వుండాలి. ఎందుకంటావా? పిల్ల మళ్ళా వచ్చి మన నెత్తిమీద ధ్వజం ఎత్తకుండా. ఏమంటావు?" నేను, మణి సావిట్లోకి వచ్చేటప్పటికి అమ్మతో సుందరమ్మ మామ్మ ఆడపిల్లల సంబంధాలవిషయంలో చెబుతున్నది.

"రోజురోజుకు కట్నాలరేట్లు అధికమైపోతున్నవి. స్కూలు ఫయినల్ చదివే వారికి రెండు వేలు, ఎఫ్.ఎ. చదివితే నాలుగు వేలు ఇలా తరగతికి రెండు వేలు అధికం. పిల్లల బాలతొడుగు, మరి లాంఛనాలు, పెళ్లి ఖర్చులు. నలుగురు ఆడపిల్లలుగల కుటుంబం అయితే ఇక వేరే చెప్పాలా? తక్కువ సంబంధానికి ఇవ్వలేరు చేతులారా. కొత్త చదువుకున్న వారితో తూగలేరు. అప్పో సప్పో చేసి పెళ్లిచేస్తారనుకోండి మళ్ళా పండగలకు పబ్బాలకు అబ్బాయిగారి కోర్కెలు భక్తుడిలా శిరసావహించాల్సిందే. పోనీ అన్నిటికీ తలవంచితే ఇక అబ్బాయిగారి గుణాలు...

"మిమ్మల్ని కన్నందుకు తలిదండ్రులు ఇంత కష్టపడుతున్నా మళ్ళా మీతో ఎన్ని మాటలు పడాలే......" మామ్మ కొద్దిగా నవ్వుకున్నది.

"అవతే మామ్మా! అసలు ఆడపిల్లలు పెళ్లిళ్లు చేసుకోమని సత్యాగ్రహం చేసి, చదువుకొని ఇంత వుద్యోగం చేసుకోవాలి. అప్పుడు గాని ఈ మగవాళ్ళ రేట్లు తగ్గవు" అంది మణి.

"నిజమే. నలుగురు కల కుటుంబంలో మరి అందరకు చదువు చెప్పించుకొనే తాహతు ఆ తండ్రికి వుండాలా అక్కరలేదా? చదువుతో ఏం సరిపోయేనే పిచ్చితల్లీ. మీకు మంచి మంచి పౌడర్లు చీరెలు ఇంకా అమాం బాపతు పైఖర్చు అంతా భరించాలి. 'అతేమిటే అమ్మాయ్' అంటే నలుగురిలో మెలగే వాళ్ళకు అమాత్రం చిల్లర ఖర్చు లేకపోతే ఎట్లాగు అంటారు. పోనీ భరిస్తాం అనుకో; మీ బుద్ధులు సరిగా వుండాలె అమ్మాయ్. ఈ సత్యాగ్రహంల్లోని ఓ పిల్లకు ఆకలి వేసిందా......పరువు మర్యాద అంతా మంటలో కలిసిపోతుంది. ఇటు తలిదండ్రులు వురిపోసుకుంటారు" నవ్వింది బుసబుసా మామ్మ మణివంక చూస్తూ. ఎందుకంటే మణి నోరు కట్టేసిన తన వాక్చాతుర్యానికి.

మణి బుంగమూతి పెట్టుకున్నది "ఆడపిల్లలంటే తలిదండ్రులకే ఇంత విసుగు, హేళన, నీరసం... కాబట్టే కట్నాల రేట్లు అంత హెచ్చు అయిపోతున్నవి. కట్నం పెళ్ళికి ఖర్చు పెట్టేబదులు ఆ డబ్బు పెట్టి చదువు చెప్పించుకోకూడదా? ఏం?" లోపలవున్న అక్కసునంతా ముఖంలో నుంచి చిమ్ముతూ అన్నది పట్టుదలగా.

"వాటితనే చదువులు చదివేసి వుద్యోగాలు వెలగేసి వూళ్లు ఏలుతారా? ఇంతకీ అమ్మాయ్, ఒక్క మాట. ఎన్ని సత్యాగ్రహాలన్నా చెయ్యండి, వాళ్ళకేమే. వాళ్లు మగమహారాజులు.." కొంచెం హేళనగా మాటల్లో హుందా తెచ్చుకొంటూ అన్నది. మామ్మ మాటల్లో మణిని ఏడిపించాలనే చిలిపి భావం కనబడింది. మరొక సంగతి ఏమంటే ఆవిడకు మచ్చుకైనా ఆడపిల్ల లేదు. అందుకనే దర్జా తెచ్చుకున్నట్లు మాట్లాడింది.

మణికి కొంచెం వుడుకుమోతుతనం వచ్చింది. "మరే మగ మహారాజులు..." ఏదో బుర్రలోకి తట్టినట్లు. "ఓహో మగపిల్ల తల్లివికదూ..."


"మగపిల్ల ఏమిటే..." నవ్వుతూ మా అమ్మ చాపమీద కాళ్ళు పారజాపుతూ అన్నది. కావాలనే అన్నట్లు మణి అమ్మవంక మామ్మవంక చూచి ముసి ముసి నవ్వులు నవ్వింది. మణి భావం గ్రహించి వుంటుంది మామ్మ.

"చూడవే మీకు మాటలాడటమే తెలీయకపోయె. మీరు సత్యాగ్రహాలు చేస్తారటే..." అన్నది తన ఓటమిని గెలుపుగా మార్చుకొంటూ.

మణి తెల్లబోయింది; వుక్కురోషం వచ్చింది. తనను అంత చిన్న సన్నాసిని చేసినందుకు ఏమి మాట్లాడాలో భాషకు అందలా భావాలు. ఇంతలో బాబాయి వచ్చాడు. వాళ్ళిద్దరిమధ్యనా సంధిపత్రంలా. బాబయ్య మాకు అంత దగ్గర చుట్టరికం కాకపోయినా రాకపోకలు దగ్గరి చుట్టరికంగా అంటిపెట్టుకున్నవి. కుశల ప్రశ్నలు అయిన తరువాత శుభలేఖ చేతికియిచ్చి "అమ్మాయి పెళ్ళి 25వ తారీఖున, మీరందరు రెండురోజులు ముందుగానే రండి ఇంకా చాల పనులు మిగిలివున్నయ్. వస్తాను మరి" అంటూ లేచాడు.

"ఇంతకీ వివరాలేం చెప్పారుకాదు. పిల్లాడు ఏమి చదువుకున్నాడు? ఎంత కట్నం? అయిన సంబంధమేనా? కుటుంబ పరిస్థితులు ఎలాంటివి? అందంగా వుంటాడా? మనపిల్లకి తగినవాడేనా?" అని ప్రశ్నలు ఒక్కసారి కురిపించింది. మా అమ్మ. అసలు ఎండలో పడి వచ్చిన బాబయ్యకు అన్ని ప్రశ్నలు గొంతుక దిగుతయ్యో లేదో అనికూడ ఆలోచించకుండా, ఆడవాళ్ళనైజమే ఇంత అన్నట్లు అడిగివేసింది.

ఆయనేమి తక్కువ చెయ్యా. "దూరపు సంబంధమే; కుటుంబ గౌరవం విషయంలో వేరే చెప్పనక్కరలేదు. పిల్లవాని విషయంలో అంత అందగాడు కాకపోయినా అందహీనుడు మటుకు కాదు. వుంటాడు మధ్యరకంగా. ఇద్దరకు జోడు బాగా వున్నది. స్కూలు ఫయినల్ చదివాడు. సినిమారిప్రజెంటెటివ్. నెలకు వందరూపాయలు దివ్యంగా తెచ్చుకుంటాడు. కట్నం సంగతంటావా? రెండువేలు, వుంగరం, వాచి, సూటు. ఇహ, లాంఛనాలు బాలతొడుగు అందరకు తెలిసినవేగా. మరొక సంగతి, పిల్లను పిల్లవాడికి పిల్లవాడిని పిల్లకు చూపించి వాళ్లకు ఇష్టమైన తరవాతనే శుభముహూర్తం పెట్టించాను. 'నాకు నచ్చని మొగుడ్ని అంటగట్టారు మొదట నాకు చూపించి చేశారా ఏం?' అని అమ్మాయి వల్ల తరువాత మాటరాకుండా చేసుకున్నాను."



అన్నాడు - తను ఏదో ఘనకార్యం సాధించినట్లు కొత్త నవ్వాడు. అమ్మ అడిగిన అన్ని ప్రశ్నలను ఒక్క ముక్కయినా మిగలకుండా హరాయించేసుకున్నాడు. "వెళ్ళొస్తాను" అన్నాడేగాని ఆమాట ఎవరూ వినిపించుకున్నట్లు లేదు. ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నాం.

బాబయ్యకు ఎనిమిది ఎకరాల పొలమున్నది. ఐదుగురు మగపిల్లలు, ఒక్కతే ఆడపిల్ల. బాబయ్యవంటి పిసినిగొట్టు మరి ఒకరుండరు. అలాంటివాడు రెండు వేలు కట్నం. లాంఛనాలు జరుపబోతున్నాడంటే మాకందరకు ఆశ్చర్యం వేసింది. అందులో పూర్వాచారం ఆయన ముఖాన, వేషభాషల్లో వుట్టిపడుతూంటుంది. అలాంటి బాబయ్య స్వయంవరనిర్ణయంలోకి ఒక్కసారి దూకాడంటే ఈ సంవత్సరం చేలన్నీ విరగపండుతాయేమో అనుకున్నాము.

రేపు పెళ్ళి అనగా వెళ్ళాం. పెద్దబలగం వున్నా ఎవరినీ పిలువలేదు. పెళ్లివారు వచ్చారు. బాజాలు మ్రోగుతున్నయ్. బ్రాహ్మణులు మంత్రాలు చదువుతున్నారు. పుస్తె కట్టేముందు కట్నం పొయ్యమన్నారు - రొఖ్ఖం - ఖచ్చితంగా.

"కట్నం నేను ఇవ్వనంటే సరేనని ఇప్పుడు కట్నం ఇవ్వమంటారేమయ్యా" అన్నాడు బాబయ్య - ఒక్కటే మాట. "ఇదేనా మీ మర్యాద" అన్నట్లు ప్రతిధ్వనించింది.

పెళ్ళివారి ముఖాన నెత్తురుచుక్క లేదు. పెళ్ళికొడుకు వారి తరఫున ఒక పెద్ద మనిషి "పదిమందిలో ఒప్పుకొని ఇలా అబద్ధమాడితే మేమేం చెప్పగలం" అన్నాడు సౌమ్యంగా. బ్రాహ్మణులు ముహూర్తం దాటిపోతున్నదన్నారు. పెద్దలు మాట్లాడుకుంటూనే వున్నారు. పెళ్ళికొడుకు పెళ్ళికూతురి మెడలో మంగళసూత్రం కట్టాడు. అది చూచి మరింత ధీమాగా మాట్లాడుతున్నాడు బాబయ్య. వాళ్ళవీళ్ళ తర్జనభర్జనలతో తెల్లవారవచ్చింది. "పిల్ల పేర ఒక అర ఎకరం పెడతాను - ఎప్పుడో నాయిష్టం వచ్చినప్పుడు" అన్నాడు బాబయ్య. అంత మొండిగా మాట్లాడుతున్నప్పుడు వాళ్లు లేచిపోతారేమో అనుకున్నాము. పెళ్ళికొడుక్కి తండ్రి లేడు. వచ్చినవాళ్లు, పెళ్ళికొడుకు ఏవేవో గుసగుసలాడుకున్నారు. అప్పగింతలు వచ్చినయ్. పెకొడుకు తరఫువారిని పిలవమన్నారు; చూస్తే ఏమున్నది? పెళ్ళికొడుకు తల్లి బంధువులతో ఎప్పుడో చక్కా వెళ్ళిపోయింది. అనుకున్న లాంఛనాలు బాబయ్య జరుపలేదు. పెళ్లి పందిరంతా రభస అయింది. అప్పగింతలవేళ అయింది. పిన్ని కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తున్నది.

"ఆడపిల్ల పుట్టినక్షణానే 'ఆడ...పిల్ల' అన్నారు. పిల్ల పేరులోనే దాని భవిష్యత్ ఇమిడివున్నదాయె "ఆడ" పిల్లయే గాని "యీడ అంటే యిక్కడ" పిల్ల అవుతుందా? మన పిచ్చిగాని అది మనం గ్రహించుకోలేక మమత పడుతామె తల్లీ; వూరుకోవే అమ్మాయ్" అని ఏభయ్యేళ్ళ ముదిపడుచు మా పిన్నిని ఓదార్చింది.

అలాగే ఏదో అయిందనిపించారు అప్పగింతలు.

పెళ్లికొడుకు అతని స్నేహితులు తప్ప మిగిలినవారు ఇదివరకే వెళ్లిపోయారు కాబట్టి పెళ్లికొడుకుని పెళ్లికూతురిని తీసుకొని స్నేహితులు ఇంటికి చేరారు. పెళ్లి

(55-వ పేజీ చూడండి)